పదో తరగతి ఇంటర్నల్ మార్కులు వెబ్‌సైట్‌లో పొందుపరచాలి

● డీఈవో రాజు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులు బీఎస్‌ఈ.తెలంగాణ.జీవోవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో ఈనెల 28లోపు పొందుపరచాలని డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత మండల విద్యాశాఖాధికారిచే ధ్రువీకరించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మార్చి 1 వరకు తప్పనిసరిగా సమర్పించాలని కోరుతున్నామన్నారు.



కొత్త పింఛన్లకు.. మోక్షమెప్పుడో?



కామారెడ్డి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్తగా పింఛన్ మంజూరు చేస్తామని, ఉన్న పింఛన్లను రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీ ఏడాదైనా నెరవేరకపోవడంతో లబ్ధిదారులు, అర్హులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల్లో వృద్ధాప్య, వితంతు, చేనేత, గీత, దివ్యాంగులు తదితర పింఛన్ల కోసం జిల్లా వ్యాప్తంగా 77,158 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఇప్పటి వరకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయలేదు. అలాగే ఎన్నికల సందర్భంగా దివ్యాంగులకు రూ.6 వేలు, ఇతరులకు రూ.4వేలు పెంఛన్లు పెంచుతామని హామీ ఇచ్చింది. కానీ ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఏ ఒక్కరికి పింఛన్ పెంచకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొత్త పింఛన్లకు మోక్షం లభిస్తుందోనని దరఖాస్తుదారులు, అర్హులకు నిరీక్షణ తప్పడం లేదు.

ఇప్పటి వరకు పింఛన్లు పొందుతున్న వారి వివరాలు

క్రమ సంఖ్య	పింఛన్ రకం	పింఛన్లు	రూ.లక్షల్లో
1.	వృద్ధాప్య	50,187	1011.77
2.	వితంతు	52,059	1049.59
3.	వికలాంగులు	18,289	734.49
4.	చేనేత కార్మికులు	580	11.69
5.	కల్లుగీత కార్మికులు	784	15.81
6.	బీడీ కార్మికులు	36,827	742.43
7.	ఒంటరి మహిళలు	4,701	94.77
8.	ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు	1,391	28.04
9.	ఫైలేరియా వ్యాధిగ్రస్తులు	561	11.31
10.	డయాలసిస్ వ్యాధిగ్రస్తులు	111	2.24
11.	బీడీ టేకెదారులు	291	5.87
	మొత్తం	1,65,781	3707.92

జిల్లాలో 1.65 లక్షల పింఛన్లు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో ప్రస్తుతం 1,65, 781 మంది ఆసరా పింఛన్లను పొందుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో చివరగా 2022లో కొత్త పింఛన్లను ఇచ్చారు. ఇప్పటి వరకు ఏ ఒక్కరికి కూడా కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వృద్ధాప్య పింఛన్లకు అర్హత వయస్సును 65 నుంచి 57 సంవత్సరాలకు పెంచింది. దీంతో అనేక మంది దరఖాస్తులు చేసుకోగా కొంత మందికి మాత్రమే పింఛన్లు మంజూరయ్యాయి. అప్పటి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడం లేదని చాలా మంది అసంతృప్తితో ఉన్న విషయాన్ని గమనించిన కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు 6 గ్యారెంటీ పథకాల్లో భాగంగా ప్రస్తుతం ఇచ్చిన పింఛన్లను రెట్టింపు చేస్తామని అర్హులైన కొత్త వారికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గత ఏడాది నిర్వహించిన ప్రజా పాలన, గ్రామ సభల ద్వారా దరఖాస్తులను స్వీకరిం చింది. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం కొత్త వారికి పింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్న పింఛన్లను పెంచకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

కొత్త పింఛన్ల మంజూరు ఎప్పుడో?

మూడేళ్ల నుంచి భర్తలు కోల్పోయిన మహిళలు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. దివ్యాంగులు సైతం ప్రభుత్వం నుంచి పింఛన్ అందుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి భర్తకు పింఛన్ ఉండి ఆయన మరణిస్తే ఆ వెంటనే ఆయన భార్యకు, భార్యకు పింఛన్ ఉండి ఆమె మరణిస్తే భర్తకు పింఛన్ మంజూరు చేస్తున్నారు. కానీ కొత్తగా ఎవరు దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయకపోవడంతో అనేక కుటుంబాలు పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారో అని ఎదురు చూస్తున్నారు. ఇటీవల ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ద ం ఖా స్తులు స్వీకరించిన ప్రభుత్వం సర్వేలు కూడా చేయించింది. అర్హుల జాబితాపై అభ్యంతరాలు సైతం స్వీకరించారు. ఈ నేపథ్యంలో కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారు ఉన్న పింఛన్లు ఎప్పుడు పెంచుతారని పలువురు అర్హులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని అమలులోకి తీసుకు రావాలని అర్హులైన వారితో పాటు పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

- జిల్లాలో చేయూత పింఛన్ల కోసం 77 వేలకు పైగా దరఖాస్తులు
- అధికారంలోకి వచ్చి ఏడాదైనా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు
- ప్రస్తుతం జిల్లాలో 1.65 లక్షల ఆసరా పింఛన్లు

నిజామాబాద్ రైతులు.. చైతన్యవంతులు!

- హర్యానా, పంజాబ్ రైతులకు తీసిపోరు
- రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాం
- ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి
- నిజామాబాద్‌లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం రేవంత్‌రెడ్డి



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నిజామాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "నిజామాబాద్ రైతులు చైతన్యవంతులు.. హర్యానా, పంజాబ్ రైతులకు తీసిపోరు. హక్కులను సాధించుకోవడంలో ముందుంటారు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడే ఆర్మూర్‌లో జరిగిన రైతుసదస్సులో పాల్గొన్నా. ఇక్కడి నుంచే నా దశ తిరిగింది. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యా. తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఇచ్చిన హామీల్లో భాగంగా రుణమాఫీ చేశాం. రైతు భరోసా కూడా ఇచ్చాం" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్‌లోని భూమారెడ్డి గార్డెన్‌లో సోమవారం జరిగిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చామని, సన్నరకాల వడ్లకు బోనస్ కూడా ఇచ్చామని చెప్పారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. తాను చేసినది నిజమని నమ్మితేనే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే పలు సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తాడని సీఎం అన్నారు. పట్టభద్రులకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటారని అన్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ప్రధానమైన నిజాంసాగర్, శ్రీరాం సాగర్ ప్రాజెక్టులను తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. ఆ ప్రాజెక్టులు నిర్మించడం వల్లే ఉమ్మడి జిల్లా పరిధిలో రైతులు పసిడిని పండిస్తున్నారని అన్నారు. అభ్యుదయ రైతులుగా ఎదిగారని అన్నారు. ఇక్కడి రైతులతో పాటు పట్టభద్రులు, ప్రజలు చైతన్యవంతులని, సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. బీజేపీ వల్ల ఉపయోగం లేదన్నారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రైతులకు చేసింది ఏమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన సంవత్సర కాలంలోనే రైతులకు కావాల్సిన పనులన్నీ చేసి పెడుతున్నామని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో రైతులకు ఇచ్చిన ఏ హామీన్నీ పూర్తి చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పనిచేసే ప్రజా ప్రభుత్వానికే ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన అభ్యర్థించారు.

సీఎం సభతో నేతల్లో జోష్

సీఎం రేవంత్‌రెడ్డి సభతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల్లో జోష్ పెరిగింది. ఎమ్మెల్సీ ఎన్నిక సందర్భంగా పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కొన్నిరోజులుగా ఉమ్మడి జిల్లా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థి గెలుపు కోసం కృషి చేస్తున్నారు. సీఎం కూడా ఈఎన్నికలను కీలకంగా తీసుకొని ప్రచా రం కోసం జిల్లాకు రావడంతో శ్రేణుల్లో కూడా ఉత్సాహం పెరిగింది. ఆత్మీయ సమ్మేళనానికి గ్రాడ్యుయేట్ ఓటర్లను ఎక్కువగా తీసుకురావడం, సీఎం మాట్లాడే సమయంలో వారి నుంచి స్పందన రావడంతో తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని నేతలు అంతా కలిసి సమన్వయంతో పని చేస్తుండడంతో అభ్యర్థి గెలిచే అవకాశం ఉందని, మరో రెండురోజులు కూడా పని చేసేందుకు పార్టీ నేతలు సిద్ధమయ్యారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర ప్రభు త్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు పి.సుదర్శన్‌రెడ్డి, భూపతి రెడ్డి, మదన్‌మోహన్‌రావు, లక్ష్మీకాంత్‌రావు, మురళీనాయక్, నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు అన్వేష్ రెడ్డి, ఈరవత్రి అనిల్, మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, కాసుల బాల్‌రాజు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఇతర నేతలున్నారు.

నిరుద్యోగులకు కేంద్రం మొండిచేయి

● టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



కేంద్రం పదేళ్ల పాలనలో నిరుద్యోగులను మోసం చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. పదేళ్ల పాలనలో 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి నిరుద్యోగులకు ఎలాంటి ఉద్యోగ కల్పన చేయలేదని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేశారని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు మద్దతు ఇస్తూ నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే 56 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాలను ఇచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అన్నారు. పట్టభద్రులు ఆలోచించాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీల నేతలు నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని అన్నారు. బీజేపీకి మేలు చేసేందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థిని నిలబెట్ట లేదని అన్నారు. పట్టభద్రులు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు : కలెక్టర్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవడానికి కలెక్టరేట్‌లో ఈ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఓటు హక్కుకలిగి ఉండి దరఖాస్తు చేసుకున్న వారు ఓటును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, ఇతర అన్ని సంస్థల యాజమాన్యాలు, నిర్వాహకులు తమ సంస్థల్లో పనిచేసే పట్టభద్రుల నియోజకవర్గాల్లో నమోదైన ఉద్యోగులకు ఓటుహక్కు వినియోగించేలా సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఓటుహక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక సాధారణ సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. ఆయా కార్యాలయాల అధికారులు ఆ సెలవును మంజూరు చేయాలని తెలిపారు.

పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

రానున్న పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమస్థానంలో నిలపాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కొత్త డైట్ మెనూను అమలుపర్చాలి

ప్రభుత్వం ప్రకటించిన కొత్తడైట్ మెనూను అమలుపర్చాలని వసతి గృహాలు, రెసిడెన్షియల్ సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ప్రజలను కేసీఆర్ కంటే.. రేవంత్‌రెడ్డే ఎక్కువగా మోసం చేస్తున్నారు

- ఉపాధ్యాయులకు, పట్టభద్రులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు
- పెండింగ్‌లో ఉపాధ్యాయులకు 5 డీఏలు, పీఆర్‌సీ
- కాంగ్రెస్ అభ్యర్థికి ఎందుకు ఓట్లు వేయాలి?
- ఆరు గ్యారెంటీల పేరుతో 420 హామీలు ఇచ్చారు
- ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ఘటనపై సీఎంకు సీరియస్‌నెస్ లేదు
- కామారెడ్డిలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ


కామారెడ్డి బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలకు కేసీఆర్ చేసిన మోసం కంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కువ మోసం చేస్తున్నాడని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ఎన్నికల ముందు ఉపాధ్యాయులు, పట్టభద్రులకు కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని అన్నారు. ఆ హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చనందునే ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థిని బరిలో దింపితే ఎక్కడ ప్రశ్నిస్తారనే భయంతో అభ్యర్థిని పెట్టలేదన్నారు. ఉపాధ్యాయులకు 5 డీఏలు, పీఆర్‌సీ ఎన్నికలకు ముందు క్లియర్ చేస్తామని చెప్పి ఒకటి కూడా చేయలేదని అన్నారు. పీఆర్‌సీ ఇవ్వలేదు, సీపీఎస్ రద్దు చేసి ఓపీయస్ అమలు చేయలేదన్నారు. అలాంటప్పుడు కాంగ్రెస్‌కు ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఎందుకు ఓట్లు వేయాలని ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. బీజేపీని గెలిపించేందుకే బీఆర్‌ఎస్ అభ్యర్థిని పెట్టలేదని కాంగ్రెస్ అంటుందని ఆమె గుర్తు చేశారు. మరి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదో సమాధానం చెప్పాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్సీ ప్రచారానికి వచ్చి ఎవరిని ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడమే కాంగ్రెస్ మోడల్ అన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో ఎన్నికల సమయంలో 420 హామీలు ఇచ్చారన్నారు. అన్ని పథకాలను అమలు చేస్తున్నామని శ్వేత పత్రం విడుదల చేస్తున్నారే కానీ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందడం లేదన్నారు. పథకాలను కొందరికి మాత్రమే ఇచ్చి అందరికి ఇచ్చామని కాంగ్రెస్ గొప్పలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా మహిళలకు రూ.2500ల పింఛన్, వృద్ధులకు పింఛన్ల పెంపు, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగులకు 4వేల భృతి, అమ్మాయిలకు స్కూటీలు పై చదువులకు రుణాలు ఇస్తామని ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. తెలంగాణలో మార్పు కోసం గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలను నమ్మి ప్రజలు అధికారం ఇచ్చారన్నారు. కానీ హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క డిక్లరేషన్ అయినా అమలు చేశారా అని ప్రశ్నించారు. మాట్లాడితే రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని చెబుతున్నారే గాని ఎన్నికల ముందుకు కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని తెలియదా అని అన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి అనుభవం లేని పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. హామీలను దృష్టి మళ్లించేందుకే సీఎం రోజుకో మాట మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటనలో 42 మంది బయటపడ్డారు కానీ మరో 8 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదన్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి సీరియస్‌నెస్ లేదని స్పష్టమవుతుందన్నారు. ఈ సమయంలో ఎప్పటికప్పుడు ఘటన సమీక్షించాల్సిన సీఎం ఎన్నికల ప్రచారంలో ఉండడం విడ్డూరమన్నారు. మోదీ నాయకత్వంలో దేశం దీక్షిత్ భారత్‌గా ముందుకు సాగుతుందని కోవిడ్ తర్వాత ధనిక దేశాలు ఆర్థికంగా చతికిల పడితే భారత్ కిందపడకుండా మోదీ అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని అన్నారు. రూ.12 లక్షల 75వేల వరకు ట్యాక్స్ బెనిఫిట్ అందించారని అన్నారు. కేంద్ర బడ్జెట్ ప్రతీ కుటుంబంలో సంతోషాన్ని నింపిందని అన్నారు. 8 ఎంపీ స్థానాలను ఇచ్చిన తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం ఇక్కడ డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని కోరారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో బీజేపీ జెండా పాతామని త్వరలో రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పుడు జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఉందని ఎన్నికల్లో పాల్గొనేది విద్యావంతులు, మేధావులని గుర్తు చేశారు. ఈ ఎన్నికలు తెలంగాణ భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసేవని అన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు బీజేపీ అభ్యర్థులైన అంజిరెడ్డి, కొమురయ్యలకు ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు. రాష్ట్రంలో బీజేపీ మూడు ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడం ఖాయమని అన్నారు. గెలిచే అభ్యర్థులను ఓడించేందుకు డబ్బులు తీసుకుని టికెట్ ఇచ్చారనే దుష్ప్రచారాన్ని ప్రతిపక్షాలు చేస్తున్నాయని అన్నారు. ఇది ముమ్మాటికి కుట్రల్లో భాగమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేది బీజేపీ అభ్యర్థులేనని ఆమె స్పష్టం చేశారు. అనంతరం కామారెడ్డి బార్ అసోసియేషన్ లాయర్లతో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లాయర్లపై జరిగే దాడులను నియంత్రించేందుకు చట్టం తేవాలని, వారి సంక్షేమానికి ప్రత్యేక నిధులను కేటాయించాలని, నూతన చట్టంలో కొన్ని లోటుపాట్లు ఉన్నాయని వాటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలని పలువురు లాయర్లు కోరారు.

గ్రంథాలయం వద్ద పట్టభద్రులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు చేస్తున్న అన్యాయాన్ని వివరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీకి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, నాయకులు గంగారెడ్డి, రాజేశ్వర్, కడెం శ్రీకాంత్, కుసుమ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో మరుగుదొడ్ల ప్రారంభం



నాళేశ్వర్‌లో మరుగుదొడ్లను ప్రారంభిస్తున్న దృశ్యం

నవీపేట,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లోని చారిత్రక రాజరాజేశ్వర ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన పుప్పాల రమేష్ తన తల్లిదండ్రులైన పుప్పాల గంగవ్వ, లింగన్నల జ్ఞాపకార్థం సుమారు రూ.3లక్షల వ్యయంతో మరుగుదొడ్లను నిర్మించి వీడీసీ సభ్యులకు అప్పగించారు.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిన్,బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, నర్సింగరావు, లక్ష్మణ్, ప్రవీణ్, శ్యామ్, రాకేష్, భీంరెడ్డి తదితరులున్నారు.

నిరంతర విద్యుత్ అందించడమే ప్రభుత్వ ధ్యేయం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

● ట్రాన్స్‌కో డీఈ ముక్త్యార్ హైమద్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వేసవి కాలంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంత విద్యుత్ సరఫరా కొరకు ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందని ట్రాన్స్‌కో డీఈ ముక్త్యార్ హైమద్ అన్నారు. లోవోల్టేజీతో ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడానికి బోధన్ టౌన్-1 సెక్షన్ పరిధిలోని రాకాసిపేట్ ఖాజా మసీద్ దగ్గర, గౌడ్స్ కాలనీలోని భీముని గుట్ట వద్ద, పెద్దిరెడ్డి రైస్‌మిల్లు ఎదురుగా 100కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను చార్జ్ చేయడం ద్వారా అన్ని కేటగిరిల వినియోగదారులకు లోవోల్టేజీ సమస్య లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజన్ ఇంజనీరింగ్ నాగేష్ కుమార్, టౌన్-1 ఏఈ నాయిని కృష్ణ, విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

ముప్కాల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మెను ప్రకారం అందజేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్ అన్నారు. సోమవారం బాల్కొండ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంట గదిని, స్టోరేజ్ నిల్వ సామాగ్రిని పరిశీలించారు. వంట గదిని శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో అందించే భోజనంపై అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట ఎంఈవో బట్టు రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువు పట్ల మక్కువ పెంచుకోవాలి

● ఆర్మూర్ కోర్టు సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి

పెర్కిట్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువు పట్ల మక్కువ పెంచుకోవాలని, చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్మూర్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి వేముల దీప్తి అన్నారు. శ్రీచంద్ర హైస్కూల్ వార్షికోత్సవం ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో గల శ్రావణ్‌గార్డెన్‌లో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి తల్లిదండ్రులు తమ పిల్లలను చదువు పట్ల ఒత్తిడికి గురి చేయరాదని, అదే విధంగా విద్యార్థులు కూడా సరైన ప్రణాళికలతో ఏర్పాటు చేసుకుని చదువుకొని ఉన్నత శిఖరాలు అదిరోహించాలని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో రాజగంగారాం, ఎస్సై గోవింద్, పాఠశాల యాజమాన్యం పొల్కం నారాయణ, ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లో వీధి నెంబర్లు కేటాయించాలి

ముప్కాల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండల కేంద్రంలోని వీధినెంబర్ వార్డుల వారీగా కేటాయించాలని కోరుతూ ముప్కాల్ గ్రామ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో నరేష్ ఆనంద్, గ్రామపంచాయతీలో వినతి పత్రం అందజేశారు. వార్డుల వారీగా వీధి నెంబర్‌లు కేటాయించడం వల్ల గ్రామం లోని వీధి నెంబర్‌లు సులువుగా ఏర్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, గైని సంజీవ్‌థామస్, నాయకుడు సంతోష్, కట్టమహేష్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలి



పన్నులు వసూలు చేస్తున్న దృశ్యం

● ఎడపల్లి ఎంపీవో మన్మోహన్ శర్మ

ఎడపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎడపల్లి ఎంపీవో మన్మోహన్ శర్మ పేర్కొన్నారు. శనివారం నెహ్రూనగర్, ఎడపల్లి గ్రామాలలో పన్నుల వసూళ్ల కోసం పంచాయతీ కార్యదర్శులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా వందశాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ ఇంటి పన్నులు చెల్లించాలని కోరారు. పన్నుల చెల్లింపుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఉదయ్ భాస్కర్, రాములు, సాయి కుమార్, అఫ్రీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువపై పిచ్చి మొక్కల తొలగింపు

ఏర్గట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మురగు కాలువపై పిచ్చి మొక్కలు పెరగడంతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన అస్తవ్యస్తంగా మురుగు కాల్వలు కథనానికి స్పందించి ఎంపీవో శివచరణ్ జీపి సిబ్బందితో మురుగు కాలువ పూడిక తీయించి పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో జీపి కార్యదర్శి జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే

● బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య



కామారెడ్డిలో మాట్లాడుతున్న బీజేపీ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల బీజేపీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వరలక్ష్మి గార్డెన్‌లో తపాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతీ పాఠశాలలో స్కావెంజర్లు లేక చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ప్రభుత్వానికి ఉపాధ్యాయులు మొర పెట్టుకున్నా స్పందించడం లేదన్నారు. శాసనమండలిలో తన గళం వినిపించేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. ఉపాధ్యాయుల వెన్నంటే ఉంటూ సమస్యలను పరిష్కరిస్తానని అందుకు ఈ నెల 27న జరుగనున్న టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ బీజేపీ పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం దాదాపు ఖరారైందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చి హామీలను నిలబెట్టుకోలేకపోవడంతో ఉపాధ్యాయులు ఎక్కడ ప్రశ్నిస్తారోనని టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిని నిలబెట్ట లేదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముగ్గురు బీజేపీ అభ్యర్థుల గెలుపుతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సంభవిస్తాయని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకే టీజేఎస్ మద్దతు

ఖిల్లా,ఫిబ్రవరి24 (ఆంధ్రజ్యోతి):శాసన మండలికి జరుగుతున్న ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థికే తమ పార్టీ మద్దతు ఉంటుందని తెలంగాణా జనసమితి పార్టీ నాయకులు తీర్మాణించినట్లు వెల్లడించారు. సోమవారం వారు జిల్లా కేంద్రంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్ ఆదేశాల మేరకు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నరేందర్‌రెడ్డికే మద్దతు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ స్థానం కోసం పోటీ చేస్తున్న వై.అశోక్‌కు తమ పార్టీ మద్దతు ప్రకటించిందన్నారు. తీర్మాణం చేసిన వారిలో దువ్వ వెంకట్, కిరణ్, ప్రసాద్, తదితరులు ఉన్నారు.

25న జిల్లా స్థాయి బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 25న బేస్‌బాల్ నిజామాబాద్ జిల్లా స్థాయి జట్టు ఎంపిక పోటీలను మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు జిల్లాబేస్ బాల్ అధ్యక్షుడు మధుసుదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సొప్పరి వినోద్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర, బాలికల ఎంపిక 25న ఉదయం 9గంటలకు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొనాలనే ఆసక్తిగల క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేశ్, మౌనిక, జ్యోత్స్నలకు రిపోర్టు చేయాలని తెలిపారు.

సుంకెట్‌లో ఎనిమిది వందల ఈత చెట్ల దహనం



సుంకెట్‌లో గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేసిన ఈత చెట్లు

మోర్తాడ్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామంలో గీతకార్మికులకు చెందిన 800ఈత చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారని గీత కార్మికులు తెలిపారు. గీతకార్మికులకు చెందిన భూమిలో పెంచుతున్న ఈతచెట్లు కల్లు తీయడానికి ఈతచెట్లను కొయించారు. ఎనిమిది మంది గీతకార్మికులకు చెందిన ఈత చెట్లు కల్లు తీయడానికి శుభ్రం చేయించామని తెలిపారు. కాగా గుర్తుతెలియని వ్యక్తులు ఈత చెట్లను దహనం చేశారని వాపోయారు. అంతే గాక ఈత చెట్ల కోసం నీరు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన పైపులు, బోర్లు వైర్లు పూర్తిగా కాలిపోయాయని వారు తెలిపారు. కావాలనే తమ ఈత చెట్లను దహనం చేశారని వారు తెలిపారు. దుర్గి నారాగౌడ్, కైరి రాజలింగం గౌడ్, సతీష్‌గౌడ్, సత్యనారాయణగౌడ్‌లకు చెంది నవే కాక మరికొందరు గీతకార్మికుల ఈతచెట్లు దగ్ధమయ్యాయని తెలిపారు. చెట్లు గీసుకొని ఉపాధి పొందే తమకు చెట్లు దహనం కావడంతో ఉపాధి లేకుండా పో యిందని గీతకార్మికులు వాపోయారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు సంఘటన పట్ల స్పందించి నిందితులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని వారు కోరారు. గత సంవత్సరం కూడా ఇలాగే దగ్ధం చేశారని గీతకార్మికులు వాపోయారు.

నాసిరకం పనులతో మత్తడి వద్ద కుంగిన బీటీరోడ్డు



మోర్తాడ్ శివారులో మత్తడి బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోయి ప్రమాదకరంగా మారిన దృశ్యం

మోర్తాడ్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ శివారులో వడ్యాట్ రోడ్డులో మత్తడి పనులు నాసిరకంగా జరగడంతో బీటీరోడ్డు ఒకవైపు ప్రమాదకరంగా కుంగిపోయింది. గతంలో కురి సిన భారీ వర్షాలకు ముసలమ్మ చెరువు నుంచి వచ్చే ప్రధానకాలువకు వరదల వల్ల మత్తడి ఇరువైపులా తెగిపోయి భారీగా గుంత ఏర్పడింది. దీంతో వడ్యాట్‌కు వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. గతంలో మంత్రిగా పని చేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రోడ్డు భవనాల శాఖ ద్వారా మైనర్ బ్రిడ్జి, మరమ్మతులకు రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. అయితే కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా నాసిరకం పనుల వల్ల బీటీరోడ్డు సగం వరకు కుంగిపోయింది. ప్రస్తుతం ఈ రోడ్డు ప్రమాదకరంగా మారింది. లారీల వంటి భారీ వాహనాలు ప్రయాణిస్తే దిగబడే ప్రమాదం ఉంది. దీంతో వాహనాలు, బస్సులు ఒకే వైపు నుంచి జాగ్రత్తగా వెళ్తున్నాయి.

రోడ్డంతా ఒకేలా ఉందని భావించి వెళ్తే వాహనదారులు మత్తడి వాగులో పడే ప్రమాదం ఉందని పలువురు రైతులు అంటున్నారు. దీని నిర్మాణ సమయంలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం తోనే నాసిరకం పనులు జరిగాయని గ్రామస్థులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డుకు మరమ్మతులు చేయాలని మోర్తాడ్; ఒడ్యాట్ గ్రామస్థులు కోరుతున్నారు.

ఆడపిల్లల రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాలు



కోటగిరిలో మాట్లాడుతున్న సాధికారత కేంద్రం నిపుణురాలు కవిత

కోటగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆడ పిల్లల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాలు ఏర్పాటు చేసిందని చట్టాలను వినియోగించుకుని మహిళలు అన్నీ రంగాలలో రాణించాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం నిపుణురాలు కవిత పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో సోమవారం బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు ఉన్నాయన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనార్థాల పై అవగాహన కల్పించారు. అనతరం పలు అంశాలపై విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలల పరిరక్షణ విభాగం కోఆర్డినేటర్ సాయిలు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ కొమురవ్వ, కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారిణి సవితా రాణి తదితరులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో చికెన్ మేళా

● బర్డ్‌ఫ్లూ వదంతులు నమ్మవద్దు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): నేడు బోధన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఏ వన్ చికెన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో చికెన్ కంపెనీ ప్రతినిధులచే చికెన్ మేళా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హసన్ సేట్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో బర్డ్‌ఫ్లూపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. మధ్యాహ్నం చికెన్ భోజనంతో పాటు ఉచితంగా గుడ్లను కూడా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ కార్యక్రమానికి చికెన్ వ్యాపారులు, చికెన్ వినియోగదారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. చికెన్‌పై వస్తున్న బర్డ్‌ఫ్లూ వదంతులను ప్రజలు నమ్మవద్దని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అంతర్జాతీయ సదస్సుకు నిజామాబాద్ జేఎంకేపీఎం ఎఫ్‌పీవో పసుపు రైతులు



ఎంఎస్ఎంఈ ఎండి గ్లోరీ స్వరూపను సన్మానిస్తున్న జేఎంకేపీఎం ఎఫ్‌పీవో పసుపు రైతులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల వర్క్‌షాప్‌లో భాగంగా హైదరాబాద్‌లోని యుసుఫ్‌గూడలో అంతర్జాతీయ సదస్సుకు నిజామాబాద్ జేఎంకెపీఎం ఎఫ్‌పీవో పసుపు రైతులు వెళ్లారు. సోమవారం యుసుఫ్‌గూడలో ఎంఎస్‌పీ కార్యాలయంలో ఆ శాఖ ఎండి గ్లోరీ స్వరూపకు జిల్లా ఎఫ్‌పీవో రైతులు తయారు చేసిన పసుపు పౌడర్‌ను ఆమెకు అందజేశారు. జిల్లాలోని మనోహరాబాద్‌లో ఏర్పాటు చేసిన పసుపు క్లస్టర్‌లో జరుగుతున్న పసుప ఉత్పత్తుల గురించి వివరించారు. ఈ అంతర్జాతీయ సదస్సులో ఐదు దేశాలు అయిన శ్రీలంక, ఫిజీ, బంగ్లాదేశ్, థాయిలాండ్‌లో భారత్‌దేశాల నుంచి వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారని పసుపు ఉత్పత్తిదారుల సంఘం పరిశ్రమ డైరెక్టర్‌లు తెలిపారు. అంతర్జాతీయ సదస్సుకు హాజరైన వారిలో జీఎం సూర్యప్రకాష్‌గౌడ్, జేఎంకెపీఎం ఏపీవో డైరెక్టర్ పి.తిరుపతిరెడ్డి, భోజన్న, శ్రీనివాస్‌రెడ్డి, నగేష్, మోహన్, రైతులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని సుంకిని శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. సుంకిని మంజీరా నది నుంచి సోమవారం ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకీసేవ



సిద్దులగుట్టపై పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దులగుట్టపై సోమవారం పల్లకిసేవను భక్తులు భక్తిశ్రద్ధ లతోవ నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై శివాల యంలో సిద్దేశ్వరునికి పంచామృతాలు, బిల్వపత్రాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఏకశిల స్తంభం, హన్మాన్ ఆలయం, దుర్గామాత, దత్తత్రేయ మందిరం, రామాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. శ్రీ నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలోస్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమన్, వీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, జిమ్మి రవి, సంధ్య, బట్టు శంకర్, చెందేసి శ్రీనివాస్, ప్రశాంత్‌రెడ్డి, కొంతం మంజుల, మురళీ, సతీష్, రామాగౌడ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఎడపల్లి, ఫిబ్రవరి24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచారం గ్రామానికి చెందిన ఉమాకాంత్ అనే వ్యక్తి గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు. అతనిది నిరుపేద కుటుంబం రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి. ఉమాకాంత్ అంత్యక్రియలకు అతని తండ్రి దగ్గర డబ్బులు లేక ఇబ్బందలు పడుతున్నాడు. ఇది గమనించిన గ్రామానికి చెందిన దండెం సాయిలు(కుమార్) తమ గ్రామ వాట్సాప్ గ్రూపుతో పాటు ఇతర గ్రూపులలో మృతుని కుటంబానికి ఆర్థిక సాయం చేయాలని కోరుతూ ముందుగా తన వంతు 500రూపాయలు ఇస్తున్నానని పోస్టు చేశాడు. ఈ పోస్టును చూసిన గ్రామస్థులు, ఇతరులు తను ఇచ్చిన నంబరుకు ఆన్‌లైన్ ద్వారా, నగదు రూపంలో డబ్బులు ఇచ్చారు. ఇలా సేకరించిన రూ.19400లను గ్రామస్థులతో కలిసి ఆయన సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. దండెం సాయిలు ఇలా గ్రామంలో ఎవరైనా చనిపోయి అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని వాట్సాప్ గ్రూపులలో పోస్టు చేసి ఇప్పటి వరకు దాదాపు 15 కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా చేశాడు. అతను చేస్తున్న కృషికి గ్రామస్థులు అతనిని అభినందిస్తున్నారు.

వేసవి ప్రారంభంలోనే కర్బూజాలకు డిమాండ్



జుక్కల్ చౌరస్తాలో కర్బూజాలను విక్రయిస్తున్న దృశ్యం

జుక్కల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వేసవికాలం ప్రారంభంలో ఎండలు మొదలు కావడంతో రోడ్డుపై వెళ్తున్న పాదాచారులు కర్బూజాలు తిని సేద తీరుతున్నారు. జుక్కల్ మండల కేంద్రంలో చిరు వ్యాపారులు కర్బూజా దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు. ఒక కేజీ 20 రూపాయల చొప్పున యజమానులు కర్బూజాలను విక్రయిస్తున్నారు. వ్యాపారస్తులు పంట పొలాల నుండి 10 రూపాయలకు కిలో తెచ్చుకుని అదనంగా 10 రూపాయలు లాభం వస్తుందని వ్యాపారులు సంతోష పడుతున్నారు. మధ్యాహ్నం ఎండలు అధికంగా ఉండడంతో కర్బుజను వైద్యుల సూచనల మేరకు కర్బూజాలు జనాలు తింటున్నారని పలువురు పేర్కొన్నారు.

స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. జిల్లాకు చెందిన అమన్ రాష్ట్ర పోటీలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. ఫహద్ వెండి పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు రాజస్థాన్‌లోని జైపూర్‌లో మార్చి 21 నుంచి 23 వరకు జరుగనున్నాయి.

కేజీబీవీ పాఠశాలను పరిశీలించిన డీఎల్‌పీవో



కూరగాయలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

ఏర్గట్ల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ పరిశీలించారు. అందులో భాగంగా పాఠశాలలోని విద్యార్థులకు అందిస్తున్న భోజనశాల కూరగాయలు, వంట గదితో పాటు తరగతి గదులు పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులు చక్కగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శివచరణ్, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, ఎస్‌వో సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు

ఫటా.. ఫట్...

వాతావరణ మార్పుల వల్ల వ్యాధులు రావచ్చు

• వై.శంకర్, మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి, డిచ్‌పల్లి



వేసవి కాలం ఆరంభంలోనే ఎండలు తీవ్రంగా మండిపోతున్నాయి. దీంతో రాత్రి, పగలు సమయాల్లో వాతావరణ మార్పులు వస్తున్నాయి. పగటి పూట అధికంగా ఉండ ఉండటం, రాత్రి ఉదయం సమయాల్లో చలి తీవ్రత ఉంటడంతో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంటుందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల ఆరోగ్య విస్తీర్ణాధికారి వై.శంకర్ తెలిపారు.

ప్రశ్న: వాతావరణ మార్పులతో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంటుందా?

సమాధానం: వేసవి కాలం ఆరంభంలోనే ఎండలు దంచికోడుతున్నాయి. ఉదయం, రాత్రి సమయాల్లో వాతవరణం చల్లగా ఉంటుంది. పగటి పూట ఎండ తీవ్రతతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యే ఆస్కారం ఉంటుంది తగు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రశ్న:ఎండలు పెరుగుతున్నందున ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సమాధానం: పగటి పూట ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది కావున ప్రజలు ఏవైనా పనులు ఉంటే ఉదయం, సాయంత్రం సమయాల్లోనే పూర్తి చేసు కోవాలి. పగటి పూట ప్రయాణాలు చేయక పోవడం మంచిది.

ప్రశ్న: వేసవి దృష్య ఏలాంటి ఆహారం తీసుకోవాలి?

సమాధానం: వేసవి కాలంలో ద్రవ పదార్థలు, లిక్విడ్ జ్యూస్, కొబ్బరి బోండాలు ఎక్కువ గా సేవించాలి, తాగు నీరు రోజుకు కనీసం 4నుంచి లీటర్లు తాగాలి. మాంసాహారం మితంగా తినడం మంచింది.

ప్రశ్న: చిన్నపిల్లలో విషయంలో ఎలాంటి జాగ్రత్తలు అవసరం?

సమాధానం: ఉష్ణోగ్రతల మార్పుల వల్ల చిన్నపిల్లల్లో జలుబు, నిమో నియా వంటి అనారోగ్యగాలకు గురయ్యే అవకాశం ఉంటుంది. జాగ్రత్తలు పా టిం చాలి. అధిక వేడిమి దృష్య ఇబ్బందులు రాకుండా పిల్లలకు సులువుగా జీర్ణ మయ్యే ఆహారం తల్లిదండ్రులు అందజేయాలి. ఎక్కువగా లిక్విడ్స్ పండ్ల జ్యూస్ లను ఇవ్వాలి. ఎండలో ఆటలు ఆడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. •(ఆంధ్రజ్యోతి, డిచ్‌పల్లి)

ప్రాణాలు పోతున్నా.. పట్టించుకోరా!

● గన్నారం పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణమెప్పుడు ● కలెక్టర్‌ను కలిసినా స్పందన కరువు



టోల్‌ప్లాజా వద్ద రోడ్డు

ఇందల్వాయి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 44వ జాతీయ రహదారి గన్నారం సమీపంలో టోల్‌ప్లాజాను 2008లో ప్రారంభించారు. ప్రతీరోజు తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రతీ సోమవారం కూరగాయల మార్కెట్ రద్దీగా ఉంటుంది. మేగ్యానాయక్ తాండా, గన్నారం, దేవితండా, రూప్లా తండా, చంద్రయాన్‌పల్లి, సిర్నాపల్లి తదితర గ్రామాల ప్రజలు ప్రతీరోజు గన్నారం జంక్షన్ నుంచి ఇందల్వాయి ఇతర గ్రామాలకు పోవాల్సి ఉంటుంది. 44వ జాతీయ రహదారిపై ప్రతీరోజు వేలాది వాహనాలు వస్తూ పోతుంటాయి. గన్నారం గ్రామస్థులు తమ వ్యవసాయ పొలానికి వెళ్లాలంటే జాతీయ రహదారిని దాటి వెళ్లాల్సిందే. గన్నారం జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో జాతీయ రహదారిపై అతివేగంగా వచ్చే వాహనాలు ఢీకొట్టడంతో అనేక మంది మృత్యువాత పడ్డారు.

రోడ్డు ప్రమాదంలో 94 మంది మృతి

వ్యవసాయ, ఇతర పనుల కోసం గన్నారం చుట్టుపక్కల గ్రామ ప్రజలు గన్నారం జంక్షన్ దగ్గర రోడ్డు దాటే క్రమంలో జాతీయ రహదారిపై అతివేగంగా వస్తున్న వాహనాలు ఢీకొట్టడంతో 94 మందికి పైగా మృతి చెందగా అనేక మంది గాయాలపాలయ్యారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేనా?

గన్నారం జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గన్నారం గ్రామస్థులు పలు సార్లు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా సిబ్బందిని కలిసి గన్నారం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మాణం చేపట్టాలని గతంలో పలుసార్లు ఉన్నతాధికారులకు విన్నవించారు. జిల్లా కలెక్టర్‌కు సైతం వినతిపత్రాన్ని సమర్పించారు. అయినా టోల్‌ప్లాజా అధికారుల స్పందన కరువైంది. రోజుకో ప్రాణం పోతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గన్నారం గ్రామస్థులు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కామారెడ్డి ప్రధాన కార్యాలయంలో సైతం ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారుల ను వేడుకున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు స్పందించి గన్నారం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంకెన్ని ప్రాణాలు పోవాలి!? : గణేష్, గ్రామస్థుడు



రోడ్డు ప్రమాదంలో మా అమ్మను పోగొట్టుకున్నాను. ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను, నేషనల్ హైవే అథారిటీ అధికారులను కలిశాం. ఎవరిని కలిసినా ఫలితం లేదు. అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సిందే: రాకేష్‌గౌడ్, గ్రామస్థుడు



ఇప్పటి వరకు రోడ్డు ప్రమాదంలో ఎన్నో కుటుంబాలు బజారున పడ్డాయి. రోడ్డు దాటి పంట పొలాలకు వెళ్లాలంటేనే భయమేస్తుంది. సత్వరమే నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించి ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టాలి.



స్వయం భూ శివలింగం



ఆలయ ప్రాంగణంలోని గోపురం

బోధన్‌లోని ఏక చక్రేశ్వరాలయం



భక్తుల కొంగు బంగారం.. చక్రేశ్వరాలయం

● బోధన్‌లో మహా శివరాత్రి జాతరకు ముస్తాబవుతున్న ఆలయం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బోధన్ చక్రేశ్వరాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతుంది. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయం ముస్తాబవుతుంది. స్వయంభూ శివాలయంగా వెలసిన ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉంది. దక్షిణ భారత దేశంలోని శివాలయాల్లో మూల విగ్రహాల కంటే ఏక చక్రేశ్వరాలయంలోని శివలింగం పెద్దదని చరిత్రకారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రానికి 30కిలో మీటర్ల దూరంలో ఉన్న బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయం చరిత్రకు సాక్షిగా నిలిచింది. 64ఏళ్ల క్రితం ఎత్తైన మట్టి దిబ్బలో బయల్పడిన అపురూప ఆలయం భక్తుల కొంగు బంగారమై నేడు విరాజిల్లుతోంది. ఆలయం బయల్పడిన నాటి నుంచి నేటి వరకు ఆలయం ప్రాంగణంలో నిత్య పూజలు అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏట మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వారం రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. మరుసటి రోజు వైభవంగా స్వామి రథయాత్ర కొనసాగిస్తారు. నిత్యం జిల్లా పరిసర గ్రామాల ప్రజలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు గ్రామాల భక్తులు దైవ దర్శనం కోసం అధిక సంఖ్యలో తరలివస్తారు. కొన్నేళ్ల నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధి జరిగింది. ప్రతి సోమవారం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

● ఆలయ చారిత్రక నేపథ్యం

పట్టణంలోని ఏరియా ఆసుపత్రి సమీపంలో ఎత్తైన మట్టి దిబ్బను గుంటూరుకు చెందిన రైతు రాంరెడ్డి బుల్‌డోజర్‌తో చదును చేస్తుండగా ఆలయ 1959 ఫిబ్రవరి 7న ఆలయం బయల్పడింది. ఆలయం ద్వారం, నల్లరాతితో ఉన్న శివలింగం చెక్కు చెదరకుండా ఉన్నాయి. 13వ శతాబ్దంలో బోధన్ ప్రాంతాన్ని పరిపాలించిన కాకతీయుల కాలంలో ఆలయ నిర్మించబడి ఉంటుందని చారిత్రకాధారాలు చెబుతున్నాయి. కాకతీయ రాజుల కాలంలోనే శివాలయాల నిర్మాణం సాగింది. అతి ప్రాచీన సంస్కృతి గ్రంథం శివలీలామృతం ఏకచక్రేశ్వరాలయం ప్రస్థానం ఉందని చరిత్రకారులంటున్నారు. శాండిల్య మహార్షి తన శిష్యులతో వచ్చి ఆలయంలో వేద శివనామస్మరణ చేసే వారని చరిత్రకారులంటున్నారు. దక్షిణ భారత దేశంలోని శివాలయంలో మూల విగ్రహాల కంటే ఏక చక్రేశ్వరాలయంలోని శివలింగం పెద్దదని చెబుతున్నారు. ఈ శివలింగం రెండు అడుగుల ఎత్తు రెండున్న అడుగుల చుట్టుకొలత, పానుపట్టం చుట్టు కొలత 24అడుగులుంటుంది. ప్రముఖ శివాలయాలు వేములవాడ రాజరాజేశ్వర స్వామి, శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలోని శివలింగాల కంటే పెద్దది. ఈ శివాలయాన్ని ఏకచక్రేశ్వరాలయంగా పిలుస్తారు. అప్పట్లో జరిగిన యుద్ధాల సమయంలో ఆలయాన్ని కాపాడుకునేందుకు ఈ ప్రాంత భక్తులు మట్టితో కప్పి ఉంటారని పూర్వీకులు అంటున్నారు.

● ఆవిర్భావ దినోత్సవాలు ఇలా..

ఆలయ ఆవిర్భావ దినాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు విద్యార్థులకు, మహిళలకు వ్యాసరచన, రంగోళి, పౌరణిక వేషాధారణ, ఆటలు, ఆనందమేళ పోటీలు నిర్వహిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

● బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో మహశివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 26న మహ శివరాత్రి సందర్భంగా బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. వేద పండితులు గణేష్ మహరాజ్ మంత్రోచ్ఛరణల మధ్య గణపతి పూజ, మహన్యాస పూర్వ లఘు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు గణేష్ మహరాజ్ మాట్లాడుతూ శివ నామస్మరణతో సకల శుభాలు కలుగుతాయని తెలిపారు.

● ఉత్సవాలకు భక్తులు తరలిరావాలి

హరికాంత్ చారి, ఏకచక్రేశ్వరాలయ కమిటీ చైర్మన్, బోధన్

మహా శివరాత్రి పర్వదిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో జాతరకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నాం. మహా శివరాత్రి వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని, స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

ఉప్లూర్ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం







ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయం గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభూలింగం, పల్లకీ ఊరేగింపు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న మండలంలోని ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయం మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాకు సిద్దమయింది. 5 రోజులపాటు (మహాశివరాత్రి వరకు) జరిగే బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమైనట్లు ఉత్సవాల్లో భాగంగా పల్లకి ఊరేగింపుతో ప్రారంభమైనట్లు ఆలయ ప్రధాన అర్చకులు హైగ్రీవచారి తెలిపారు. మహాశివరాత్రి వరకు ఆలయంలో ప్రతీ రోజు ప్రత్యేక పూజలు, పల్లకి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. ఈ ఆలయంలో జాతర ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మఘబహుళ చతుర్థి రోజు (ఫిబ్రవరి 26 న మహాశివరాత్రి సందర్భంగా) స్వామివారికి ప్రత్యేక పూజలు. మహారుద్రాభిషేకం జరుగుతాయని తెలిపారు. మహాశివరాత్రి బుధవారం రోజు ఉదయం గ్రామ, కమిటీ పెద్దలు ఆలయం వద్దకు చేరుకుని గ్రామ యోగక్షేమాలపై ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాతే భక్తులను ఆలయ ప్రవేశానికి అనుమతిస్తారని తెలిపారు. రాత్రి నిశిపూజ, అర్ధరాత్రి 12 గంటలకు స్వామి వారికి వేదమంత్రోత్సరణలమధ్య బ్రాహ్మనోత్తములచే మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిసేకం జరిపిస్తారు అనంతరం బలిహరణ తదుపరి గ్రామం మద్యలో నుండి స్వామి పల్లకి ఊరేగింపు ప్రారభమై (సుమారు మూడు గంటల పాటు సాగుతుంది) దేవాలయానికి చేరుకుంటుంది. తదుపరి కోరుకున్న వారి ఇంటికి దేవుడి పల్లకిని తిప్పుతారు. మహాశిరాత్రి పర్వదినం రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామానికి చెందిన, వివిధ జిల్లాలు, మండలాలనుండి వచ్చిన భక్తులు నిలువెత్తు బెల్లంతూకం వేయించిపంపిణి చేయడం, తలనీలాలు సమర్పించుకుని, కోడెదూడలు తిప్పి తమ మొక్కులు చెల్లించుకోవడం ఈ జాతరలో అనవాయితి. మహాశిరాత్రి రోజు గ్రామంలో దాదాపు ప్రజలు, శివభక్తులు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు పాటిస్తారు.

● జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జాతరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ, గ్రామ కమిటీ ఆలయానికి రంగులతోపాటు అక్కడక్క మరమ్మత్తుపనులు చేయిచారు మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా నిర్వహించే జాతర ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం, ఆలయంవద్ద నీడ, తాగు నీరు తదితర అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అభివృద్ది కమిటి అద్యక్షులు సోమ దశరత్ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు హజరై స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ధర్పల్లిలో రాజరాజేశ్వర ఆలయం ముస్తాబు



ఆలయంలో లింగం

ధర్పల్లి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో గల చెరువు ముందు తండాలో వెలసిన వెలసిత రాజరాజేశ్వర ఆలయం శివరాత్రికి ముస్తాబైంది. ఈ నెల 26న జరిగే మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ట్లు నిర్వాహకులు తెలిపారు. అర్ధరాత్రి నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అభిషేకం, స్వామి వారి కల్యాణం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వ హించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ధర్పల్లి గ్రామానికి చెందిన కీ.శే. జంగం పరమేశ్వర్ ఆలయ నిర్మాణానికి పునాది వేసి సర్వాంగ సుందరంగా నిర్మించారు. గ్రామంలో శివాలయం ఒక్కటే కావడంతో గ్రామస్థులు ఉదయం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జాగరణ సందర్భంగా వేములవాడ నుంచి ప్రత్యేకంగా ఉగ్గుకథ కళాకారులను రప్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జాగరణ కోసం ఆలయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. శివరాత్రి మరుసటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని చల్లగరిగె గ్రామంలోగల రాజరాజేశ్వరాలయం దక్షిణ వేములవాడగా ప్రసిద్ధి చెందింది. మండలంలోని రేకులపల్లి గ్రామ శివారులో సైతం శివాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రామడుగు గ్రామంలోని శివకేశవ ఆలయం మహాశివ రాత్రికి ముస్తాబైంది. మండలంలోని కొటాల్‌పల్లి గ్రామ శివారులోగల రామన్న పాదాలతో పాటు వాడి గ్రామంలో గల గంగాధర ఆశ్రమంలో ధర్పల్లి ఊర చెరువు కట్టపై వెలసిన గంగమ్మ ఆలయంలో సైతం శివాలయానికి ఏర్పాట్లు చేశారు. మండలంలోని అన్ని శివాలయాలు శివరాత్రికి సిద్ధమయ్యాయి.

శిథిలావస్థలో పాఠశాల భవనం

● పెచ్చులూడుతున్న స్లాబ్‌పై కప్పు ● నూతనంగా భవనం నిర్మించాలని వేడుకోలు
● ఇంటి నుంచే బాటిళ్లతో నీళ్లు ● మూత్రశాలలు వినియోగంలో లేక ఇబ్బందులు





శిథిలావస్థకు చేరిన చిన్నయానం ప్రభుత్వ పాఠశాల, పెచ్చులూడుతున్న పాఠశాల స్లాబ్ పైకప్పు

డొంకేశ్వర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): డొంకేశ్వర్ మండలంలోని చిన్నాయానం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. గోడలు బీటలు వారాయి. భవనం స్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. విద్యార్థులకు వంట చేయడానికి గదిలోకి రేకులకు రంధ్రం పడి వంట చేయడానికి వీలులేకుండా ఉంది. గదికి కిటికిలు లేక పాఠశాలలోకి విష సర్పాలు వస్తున్నాయి. వర్షాకాలంలో వర్షం పడితే పైకప్పు నుంచి నీరు కారుతుంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సదుపాయం లేకపోవడంతో నీరంతా స్కూల్ ఆవరణలో నిలిచిపోతుంది. దీనికి తోడు సగానికి పైగా ప్రహరీ లేకపోవడంతో పశువులు కుక్కలు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయి. విద్యార్థులకు గత నాలుగేళ్ల నుంచి పాఠశాలలో మూత్రశాల వినియోగం లేక విద్యార్థులు బయటకు వెళ్తూ ఇబ్బంది పడుతున్నారు. వాటికి నీటి సరఫరా చేసి మూత్రశాల వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. విద్యార్థులకు తాగడానికి నీళ్ల లేక ఇంటి నుంచి వాటర్‌బాటిల్‌లో తాగేనీళ్ల తీసుకొని వస్తున్నారు. పాఠశాల గదులకు కిటికిలు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు బోదన సరిగ్గా అర్థం కావడంలేదని విద్యార్థులు కోరుతున్నారు. పెచ్చులు ఉడుతున్న భవనం ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

పురాతన భవనంలోనే తరగతులు

కాల పురాతన భవనంలోకి ఒకటి నుంచి ఐదవ తరగతిలు నిర్వహిస్తున్నారు. ఉన్న ఒక భవనం అంగన్‌వాడి కేంద్రం కొనసాగిస్తున్నారు. పాత భవనంలోనే ఒక గది ప్రధాన ఉపాధ్యాయులు కార్యాలయానికి వాడుతున్నారు. ఆ గదిలో కిటికీలు సరిగ్గా లేక స్లాబ్ పైకప్పు పెచ్చులు ఊడి ఉపాధ్యాయులు కూర్చున్న సమయంలో మీద పడుతున్నాయి. ఈ పాఠశాలలో సుమారు 19మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏక్షణాన ప్రమాదం ముంచుకోస్తుందోనని తెలియక విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. విద్య అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తామని పాలకులు గొప్పలు చెబుతున్న చిన్నయానం పాఠశాలను మాత్రం పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ఈ పాఠశాలకు మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం: రామకృష్ణ, ఎంఈవో, డొంకేశ్వర్



చిన్నయానం పాఠశాల ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు నిర్వహిస్తున్నాం. పాఠశాల భవనంపై కప్ప పెచ్చులు ఊడుతున్నాయి. మైనర్ రిపేర్ కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపమని ఉపాధ్యాయులకు ఆదేశించాను.

శివస్వాముల రుద్రాభిషేకం



శివలింగానికి రుద్రాభిషేకం చేస్తున్న స్వాములు

బిచ్కుంద, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ్ శివాలయంలో శివమాలధారణ చేపట్టి శివస్వాములు సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. నిమయనిష్టలతో 41 రోజుల పాటు మూడు పూటలా స్నానమాచరించి 108 సార్లు శివన్మాస్మరణ ధ్యానం చేస్తు ఒక పూట భిక్షను ఆచరిస్తారని తెలిపారు. మహాశివరాత్రి రోజు నిలాంకర ఉపవాసం ధరించి అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం అనంత రం మాలవిరమణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శివస్వాములు సంజీవ్, బాబురావు, అశోక్, మల్లు దేశాయ్, శివశంకర్, సంతోష, కాశీనాథ్, పరమేష్ పాల్గొన్నారు.

'మల్క కొమరయ్యకు ఓటు వేసి గెలిపించండి'


మద్నూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి

మద్నూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న మల్క కొమరయ్యను మొదటి ప్రాధా న్యత ఓటువేసి గెలిపించాలని రాష్ట్ర బీజేపీ ఓబీసీ ప్రధానకార్యదర్శి డాక్టర్ విన్న ఈశ్వరప్ప కోరారు. సోమవారం మద్నూర్ మండల కేంద్రం లోని పట్టభద్రుల ఇండ్లకు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత సీపీఎస్ రద్దు పాతపెన్షన్ విధానం పునరుద్ధరణ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని, గత సర్కార్ తీసుకొచ్చిన 317 జీవోపై పోరాటం చేస్తామని, సెంట్రల్ గవర్నమెంట్ 57 జీవో ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ హామీ అమలయ్యేలా చూస్తామని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు తుకారాం, కృష్ణపటేల్, ఓబీసీ నాయకులు తులసంతోష్ పాల్గొన్నారు.

108 సేవలపై అవగాహన

రాజంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఐకేపీ లోని మహిళాసంఘాల సభ్యులకు 108 సేవలపై సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి నూతనంగా వచ్చిన 108 అంబులెన్స్ సేవలు ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని అత్యవసరసమయంలో 108కు కాల్‌చేస్తే వెంటనే అక్కడికి చేరుకుని మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాములు, పైలెట్ ప్రశాంత్ పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

బీబీపేట,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బీబీపేట వ్యవసాయసహకార సంఘం సభ్యుడు తలారి శంకరయ్య ఇటీవల మరణించాడు. సోమవారం ప్రాథమిక సహకార సంఘం నుంచి రూ.3,500ల ఆర్థిక సహాయం డైరెక్టర్ బక్కోళ్ల సత్తెవ్వ చేతుల మీదుగా అందించినట్లు బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన కొడిచీర


శివస్వాములకు భిక్ష అందజేస్తున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్

మద్నూర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : శివ స్వాములు భక్తిశ్రద్ధలతో పడిపూజ నిర్వహించి ఇరుముడితో బయలుదేరి వెళ్లారు. మండలంలోని కొడిచిరా గ్రామంలో శివ స్వాములు సోమవారం పడిపూజ నిర్వహించిన అనంతరం గురుస్వామి ఇరుముడి కట్టుకొని శ్రీశైలానికి బయల్దేరి వెళ్లారు. వారికి మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ సంగమేశ్వర్ భిక్ష అందజేశారు. శివరాత్రి నాటికి శ్రీ శైలానికి వెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహిస్తామని శివస్వాములు తెలిపారు. ఈ ఏడాది ఉమ్మడి మద్నూర్ మం డలంలో మేనూర్, లచన్, కోడిచర్ల గ్రామాల్లో శివస్వాములు దీక్షలు తీసుకోగా సోమవారం సామూహికంగా పడిపూజ నిర్వహించి ఇరుముడితో బయలుదేరివెళ్లారు.

ముస్తాబవుతున్న ఆలయాలు


ప్రాచీన ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది

లింగంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శివాలయాలను శివరాత్రి సందర్భంగా గ్రామపంచాయితీ సిబ్బంది శుభ్రం చేశారు. లింగంపేటలోని ప్రాచీన శివాలయాలు జోగినాథ ఆలయం, రామాలయం వద్ద శివాలయాలు పిచ్చి మొక్కలు ముళ్ల పొదలతో నిండి ఉన్నాయి. ఆలయాలకు భక్తులు రావడానికి ఇబ్బందిగా ఉందని భక్తులు పంచాయితీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తను తీసి వేయించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో జోగినాథ ఆలయం, నగరేశ్వర ఆలయం, రామాలయంలోని శివాలయాల వద్దకు తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా ఆలయ పరిసరాలను శుభ్రం చేసినట్లు ఎంపీవో మలహరి తెలిపారు.

'అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'


డీఈవో రాజుకు వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్‌లు చేస్తు అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్రకార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం డీఈవో రాజుకు వినతిపత్రం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యపూర్తిగా వ్యాపార మైందని గల్లిగల్లికో మోడల్ స్కూల్, ఈ-టెక్నో, ఫౌండేషన్, సివిల్స్, ఐఐటీ లాంటి తోకపేర్లు తగిలించుకుని యథేచ్ఛగా లక్షల్లో ఫీజులు వసూళ్లకు పాల్పడుతుంటే సంబంధిత విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, సతీష్,రాకేష్,బాబు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంతోనే పేదరిక నిర్మూలన

దోమకొండ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):మహిళా సంఘాల సభ్యులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే పేదరిక నిర్మూలన జరుగుతుందని ఎకేపీ ఏపీఎం రాజు అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో ఆహారం, పోషణ,ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై వీఓఏలు,ఓబీలకు ఆరోగ్య కమిటీ మెంబర్‌లకు శిక్షణ ఇచ్చారు.


దోమకొండలో మాట్లాడుతున్న ఏపీఎం

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి


డోంగ్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సోమవారం బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆమె సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌ఐ సాయిలు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

మద్నూర్ : ఈనెల 27న నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మద్నూర్ మండలంలో 417 మంది పట్టభద్రులు, 49 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారని, ఉమ్మడి మండలంలో ఎన్నికల నిర్వహణ కోసం తగిన విధంగా సిబ్బందిని ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు. డోంగ్లి మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం రెండు పోలింగ్‌కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి వెల్లడించారు. డోంగ్లి మండలంలో పట్టభద్రులు ఓటర్లు 107 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 11 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు జరిగినట్లు పేర్కొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైంది

● బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ


మాట్లాడుతున్న డీకే అరుణ

లింగంపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్ర జ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫల మైందని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని మోసం చేసిందని, ఉపాధ్యా యులకు 5డీఏలు ఇస్తామని మోసం చేసిందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఆమె సోమవారం లింగంపేట మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆమె తెలిపారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఎక్కడపోయిందని ఆమె ప్రశ్నించారు. ఉద్యోగులకు ఇస్తానన్న 5డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు నిలదీస్తారనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి అభ్యర్థిని నిలబెట్టలేదని ఆమె తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుకలను ఎన్నుకోవాలని ఆమె సూచించారు. బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి అంజిరెడ్డిని, ఉపా ధ్యాయ అభ్యర్థి కొమురయ్యలకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం రాజు, మాజీ ఎంపీ బీబీపాటిల్, జిల్లా మాజీ అధ్యక్షురాలు ఆరణతార, జిల్లా మాజీ అధ్యక్షుడు బాణాల లక్ష్మారెడ్డి, మర్రి రాంరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు క్రాంతికుమార్, దత్తు రాంలు, తల్వార్‌సాయిలు ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఎం రేవంత్ రెడ్డిది అనుభవం లేని పాలన అని బిజెపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల, బీజేపీ అభ్యర్థి చిన్న మైల్ అంజిరెడ్డి తరఫున ఆమె సోమవారం ఎల్లారెడ్డి బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఓటు హక్కుతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బీబీ పాటిల్, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింలు, పట్టణ అధ్యక్షుడు రాజేష్, ప్రధాన కార్యదర్శి నరేష్, యస్ యన్ రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున విస్తృత ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్ రెడ్డికి మొదటి ఓటు వేసి గెలిపించాలని ఎల్లారెడ్డి మాజీ మున్సిపల్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎల్లారెడ్డి పట్టణ కేంద్రం లోని వివిధ వార్డులలో పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉం టుందని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, మాజీ కౌన్సిలర్ నీలకంఠ, నాయకులు విద్యాసాగర్, సుజిత్ పాల్గొన్నారు.

తాడ్వాయి : కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మండల కాంగ్రెస్ నాయకులు అన్నారు. తాడ్వాయి మండలంలోని ఎండ్రియాల్ గ్రామంలో పట్టభద్రుల ఓటర్లను మొదటి ప్రాధాన్యత ఓటును కాంగ్రెస్ అభ్యర్థికి వేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహమ్మద్ షౌకత్, కో-ఆర్డినేషన్ కమిటీ మెంబర్ మద్ది మహేందర్ రెడ్డి, శ్యామ్ రావు, గ్రామ అధ్యక్షుడు మల్లేష్, మండల యూత్ అధ్యక్షుడు అఖిల్‌రావు, మండల ఉపాధ్యక్షులు రాజీవ్ కుమార్, తాడ్వాయి వీడీసీ ప్రెసిడెంట్ మేకల రాజు, మండల మహిళా ఉపాధ్యక్షురాలు మమత పాల్గొ న్నారు.

బాన్సువాడటౌన్ : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. కాంగ్రెస్ నాయకులు తమతమ పరిధిలో గల పట్టభద్రుల ఓటర్ల ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, రాజులున్నారు.

కాంగ్రెస్‌కు సీపీఎం సంపూర్ణ మద్దతు

కామారెడ్డిటౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి సీపీఎం పూర్తి మద్దతు ప్రకటిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం కామారెడ్డి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నాలుగు జిల్లాలలో నలుగురు బీజేపీ ఎంపీలు ఉండి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తీసుకురావడంలో వైఫల్యం చెందారని అన్నారు. తెలంగాణ విభజన హామీలను ఏ ఒక్కటీ బీజేపీ నెరవేర్చలేదని తెలిపారు. కరీంనగర్ జిల్లాకు బండిసంజయ్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఉండి కూడా సైనిక్ పాఠశాలగాని, కొత్తగా నవోయ పాఠశాలలు గాని తీసుకురాలేదని నిజామాబాద్‌కు పసుపుబోర్డు ప్రకటించినప్పటికి కేంద్ర బడ్జెట్‌లో ఒక్కరూపాయి నిధులు కేటాయించలేదని అన్నారు. కార్య క్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, కొత్తనర్సింలు, ముదాం అరుణ్ పాల్గొన్నారు.

మాచారెడ్డి : కాంగ్రెస్ పట్టభద్రుల అభ్యర్థి నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువ జన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బట్టెంకి బాల్‌రాజు అన్నారు. సోమవారం పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామంలో పట్టభద్రులను కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్ర మంలో మండల అధ్యక్షుడు బట్ట రాజు, రాగుల రమేష్, రవీందర్, రాజు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దోమకొండ : ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు తెలపాలని దోమకొండ మండల పార్టీ అధ్యక్షులు చంద్రయ్యగారి అనంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అంబార్‌పేట గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ తాటిపల్లి శ్రీకాంత్, నాయకులు శంకర్‌రెడ్డి, ఈశ్వర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు వినీత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిచ్కుంద : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సద్గురు బండాయప్ప ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పట్టభద్రున్ని అన్ని మండలాల్లోని నాయకులు ప్రత్యేకంగా వెళ్లి కలిసి ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను వారికి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో బిచ్కుంద, మద్నూర్, డొంగ్లి, జుక్కల్ మండలాల ప్రజాప్రతినిధులు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

విద్యార్థులు కష్టంతో కాదు.. ఇష్టంతో చదవాలి


రచయితను సన్మానిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తాడ్వాయి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని మై ఫుట్ ప్రింట్ బుక్స్ రచయిత డాక్టర్ అంబీర్ రాజేంద్ర ప్రసాద్‌రావు అన్నారు. ఈయన జడ్పీహెచ్ఎస్ దేమికలాన్ పాఠశాలను సందర్శించి విద్యార్థులను ఆశీర్వదించారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రిజల్ట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చిన ముఖ్యఅతిథికి ఉపాధ్యాయులు విద్యార్థులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సుధాకర్ రావు, మారుతి, రాధ, భాస్కర్ రెడ్డి, నారాయణ, సతీష్, అనిల్, మనోహర్‌రావులు పాల్గొన్నారు.

తుదిజాబితాలో ఓట్లను యథావిధిగా ఉంచాలని నిరసన


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న ప్రైవేట్ లెక్చరర్‌లు

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల టీచర్ ఎమ్మెల్సీ ఓట్లను తప్పుడు ఫిర్యాదుతో తొలగించారని తుదిజాబితాలో ఓట్లను యథావిధిగా ఉంచాలని లెక్చరర్లఫోరం అధ్యక్షుడు బాలు అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రయివేట్ లెక్చరర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేందర్‌రెడ్డి పేరుతో తప్పుడు ఫిర్యాదు చేశామని కొందరు తహసీల్దార్లు అవగాహనా లోపంతో ప్రయివేట్ అధ్యాపకులు, ఉపాధ్యాయుల ఓట్లను తొలగించారని, అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేసి తుదిజాబితాలో ఓట్లు వచ్చిన తర్వాత ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమకు అనుకూలంగా ఓటు వేయరనే దురుద్దేశంతో ఓ ఉపాధ్యాయ సంఘం వారు ఈ పని చేశారని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకుల సంఘ పట్టణ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్, భీమాగౌడ్, రవి, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

కల్వరాల్ పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఏర్పాట్లు

సదాశివనగర్,ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వరాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం జరిగి 60 ఏళ్లు కావస్తున్న సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలకు సిద్ధం చేస్తున్నట్లు ప్రధానో పాధ్యాయుడు విష్ణువర్ధన్ తెలిపారు. 1965లో ఏర్పాటైన పాఠశాల 2025 నాటికి 60 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటీ పూర్వవిద్యార్థుల సంయుక్త సహకారంతో మార్చి 7న పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. గోల్డెన్ జూబ్లీ వేడుకకు సంబంధించి ఏర్పాట్లు చేయడానికి తొమ్మిది మందితో కూడిన కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు.

మానసిక ఒత్తిడి అధిగమించడంపై అవగాహన

బిచ్కుంద,ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు మహిళాసాధికారత విభాగం ఆధ్వర్యంలో బ్రహ్మకుమారి ఉష రాజయోగ టీచర్‌తో మానసిక ఒత్తిడి అధిగమించడంపై అవగాహన కల్పించారు. జీవితంపై సానుకూల దృక్పథం పెంపొందించుకోవడం ఆశావాదంతో అనుకున్నవి సాధించాలి అని ప్రిన్సిపల్ అశోక్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత కో-ఆర్డినేటర్ రేవతి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘ సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

బీబీపేట, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): బీబీపేట వ్యవసాయ సహకార సంఘం సభ్యుడు తలారి శంకరయ్య ఇటీవల మరణించాడు. సోమవారం ప్రాథమిక సహకార సంఘం నుంచి రూ.3,500ల ఆర్థిక సహాయం డైరెక్టర్ బక్కోళ్ల సత్తెవ్వ చేతుల మీదుగా అందించినట్లు బీబీపేట ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

సింగిరాయిపల్లి గ్రామంలో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రామారెడ్డి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగిరాయిపల్లి గ్రామంలో అనుమతి లేకుండా అక్రమంగా నడిపిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకున్నట్లు రామారెడ్డి ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సింగిరాయిపల్లి గ్రామానికి చెందిన రామాగౌడ్ ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన మహిపాల్ అనే డ్రైవర్ అనుమతి లేకుండా నడపడం వల్ల ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ వివరించారు.


విద్యుత్ అంతరాయం నివారించేందుకు వీసీబీ ఏర్పాటు

కోటగిరి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో విద్యుత్ అంతరాయాలు నివారించేందుకు సబ్ స్టేషన్‌లలో వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్‌ను (విసిబి) ఏర్పాటు చేస్తున్నట్లు బోధన్ ట్రాన్స్‌కో డీఈ ముక్తార్ హైమద్ పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని పొతంగల్, హెగ్డోలి, కల్లూర్ సబ్ స్టేషన్‌లలో సోమవారం విసిబిలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హంస్నాపూర్, కారేగాం 11 కేవి ఫిడర్లకు ఒకే వీసీబీ ఉండడం వలన తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడేవన్నారు. హంస్నాపూర్ ఫిడర్‌కు విసిబి ఏర్పాటు చేయడంతో విద్యుత్ అంతరాయం ఉండదన్నారు. కల్లూర్ 11కేవి ఫిడర్, కొడిచర్ల లిఫ్ట్ ఫిడర్లకు కలిపి మరో వీసీబీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు నగేష్, ఫక్రుద్దీన్ ఖాద్రి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు చేసిన పోలీసులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అచ్చంపేటలో విద్యాభ్యాసం చేస్తున్న 10వ తరగతి విద్యార్థి అదృశ్యమయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ జనార్ధన్ సోమవారం నిజాంసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

ఇదే పాఠశాలలో విద్యా భ్యాసం చేస్తున్న బుయర్ ఓంకార్ గ్రామము పెద్ద శేఖర్‌గా మండలం మద్నూరుకు చెందిన విద్యార్థి నిజాంసాగర్ మండలం అచ్చంపేటలోని గురుకు లంలో విద్యాభ్యాసం చేస్తూ ఉన్నారు. ప్రిన్సిపాల్ జనార్ధన్ తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి ఈనెల 19వ తేదీన స్కూల్లో కంప్యూటర్ క్లాస్ చెప్పే వివేక్వర్ధన్ లాప్టాప్ కనబడటం లేదని తెలిపారు. దీంతో పాఠశాలలో ఉన్న సీసీ కెమెరాలు పరి శీలించారు. ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న ఓంకార్ లాప్టాప్‌ను తీసినట్లుగా కనిపించింది. ఈనెల 21వ తేదీన మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఓంకారంను పిలిచి అడగగా సార్ నేనే అట్టి లాప్టాప్‌ను తీశానని, సాయంత్రం వరకు తీసుకొస్తానని తెలిపారు. ఈనెల 22వ తేదీ వరకు మధ్యాహ్నం 11 గంటల 30 నిమిషాల వరకు కూడా ఓంకార్ తెచ్చి ఇస్తానని చెప్పి ఇప్పటికీ లాప్టాప్‌ను తీసుకురాక పోయారు. అప్పటినుండి ఓంకార్ కనబడటం లేకపోవడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. తల్లిదండ్రులు వెతికిన ఆచూకీ కనపడలేదు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ ఓంకార్ కనబడటం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓంకార్ ఒంటిపై నల్లటి గీతల డబ్బాల నలుపు రంగు ప్యాంటు తెలుపు రంగు చొక్కా ధరించి ఉన్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇతను ఆచూకీ కనబడినట్లయితే నిజాంసాగర్ పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై శివకుమార్ తెలిపారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - చావా
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - తండేల్

బాన్సువాడ

మహేశ్వరి - తండేల్
వెంకటేశ్వర - రామం రాఘవం



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

